
సాక్షి
మెదక్

శనివారం । 18 । మే । 2024



హడలెత్తిస్తున్న పిడుగులు
పిడుగులు మనుషుల, మూగ జీవాల ప్రాణాలు తీస్తున్నాయి. రైతులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది.
వివరాలు 8లో ▸



ఆశ్రయం ఏదీ?
మెదక్ పట్టణ పరిధిలో రూ.65 లక్షలతో నిర్మించిన నిరాశ్రయుల ఆశ్రయ కేంద్రం నిరుపయోగంగా మారింది.
వివరాలు 8లో ▸



లోదుక్కు.. లాభాలు దక్కు
ఏ పంట వేయాలన్నా ముందుగా దుక్కి దున్నాల్సిందే. లేకుంటే చీడపీడలు ఆవాసం ఏర్పాటు చేసుకొని భూమి సత్తువ కోల్పోతుంది.
వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

మెదక్ చర్చి సందర్శన



చర్చిలో హైకోర్టు న్యాయమూర్తి శ్యామ్ కోష్యా

మెదక్‌జోన్: ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్ సీఎస్ఐ చర్చిని హైకోర్టు న్యాయమూర్తి శ్యామ్ కోష్యా కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం సందర్శించారు. ఈసందర్భంగా చర్చి ప్రెసిబెటరీ ఇన్‌చార్జి శాంతయ్య ప్రత్యేక ప్రార్థనలు చేసి చర్చి విశిష్టతను వివరించారు. ఆయన వెంట మెదక్ కోర్టు న్యాయమూర్తి జితేందర్, ఆర్డీఓ రమాదేవి, తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



రికార్డులు తనిఖీ చేస్తున్న జిల్లా ఇన్‌చార్జి పశువైద్యాధికారి వెంకటయ్య

కొడిపల్లి(నర్సాపూర్): పశు పోషకులు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఇన్‌చార్జి పశువైద్యాధికారి వెంకటయ్య సూచించారు. శుక్రవారం కొడిపల్లిలోని పశువుల ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, మందులను పరిశీలించి మాట్లాడారు. అప్రమత్తంగా ఉంటే సీజనల్ వ్యాధుల నుంచి పశువులను కాపాడుకోవచ్చని చెప్పారు. వర్షం పడే సమయంలో పశువుల కాపర్లు చెట్ల కింద ఉండవద్దన్నారు. పశువులకు ఎలాంటి వ్యాధి సోకిన వెంటనే వైద్యులను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి రాజు, వెటర్నరీ అసిస్టెంట్ చెన్నయ్య, సుజాత తదితరులు పాల్గొన్నారు.

అందరి కృషితోనే పోలింగ్ పెంపు: ఆర్డీఓ

నర్సాపూర్: అందరి కృషితోనే పార్లమెంట్ ఎన్నికల్లో నర్సాపూర్ నియోజకవర్గంలో పోలింగ్ పెరిగిందని ఆర్డీఓ, అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. నియోజకవర్గంలో 84.25 శాతం పోలింగ్ నమోదు కావడంతో నర్సాపూర్‌కు రాష్ట్రస్థాయిలో గుర్తింపు వచ్చిందన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొన్న అధికారులు, సిబ్బంది ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు కృషి చేశారని కొనియాడారు.

రైతులు అధైర్యపడొద్దు: డీసీసీ అధ్యక్షుడు

నర్సాపూర్: రైతులు అధైర్యపడొద్దని, చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని పలు కొనుగోలు కేంద్రాలను నాయకులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తడిసిన వడ్లను సైతం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. ప్రతిపక్షాలు ధాన్యం కొనుగోలు విషయాన్ని రాజకీయం చేస్తున్నా యని ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులు రైతుల కోసం ధర్నాలు చేస్తూ మొసలి కన్నీరు కారుస్తున్నారని మండిపడ్డా రు. ఆగస్టు 15లోపు రుణమాఫీ చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు మల్లేష్, శ్రీనివాస్ గుప్తా, శివప్రసాద్‌గౌడ్, శ్రీనివాస్, నర్సింహాచారి, వెంకటేష్, మహేష్ తదితరులు ఉన్నారు.

నేడు పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశం



ములుగులోని ఉద్యాన విశ్వవిద్యాలయం

ములుగు(గజ్వేల్): కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో ఈ నెల 18న ప్రాంతీయ పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశం జరుగుతుందని రిజిస్ట్రార్ భగవాన్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఉద్యాన సంచాలకులు (ఐఏఎస్) కె.అశోక్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు. అలాగే వివిధ జిల్లాల నుంచి ఉద్యాన శాఖ సంయుక్త సంచాలకులు, అధికారులు, విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు, అభ్యుదయ రైతులు పాల్గొంటారన్నారు.

తడుస్తూ.. ఎండుతూ!

- వెంటాడుతున్న అకాల వర్షాలు
- కొనుగోలు కేంద్రాల్లో రైతుల పడిగాపులు
- ముందుకు సాగని కొనుగోళ్లు

నర్సాపూర్: కొనుగోళ్లలో జాప్యం..అకాల వర్షాలతో రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. రోజుల తరబడి కేంద్రాల్లోనే పడిగాపులు గాస్తున్నారు. మొదట్లో హమాలీలు లేక తూకం ఆలస్యం కాగా తర్వాత తూకం వేసిన వడ్లను రవాణా చేసేందుకు సరిపడా లారీలు కరువయ్యాయి. కేంద్రాల నుంచి ధాన్యంతో వెళ్లిన లారీలు ఖాళీ చేసేందుకు రైస్ మిల్లుల వద్ద సరిపడా హమాలీలు లేరు. దీంతో ధాన్యం బస్తాలు లారీల నుంచి ఖాళీ చేయడానికి సమయం పడుతుందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా తమకు ధాన్యం పంపవద్దని చెబుతున్నా అధికారులు పంపిస్తున్నారని పలువురు రైస్‌మిల్లర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గోదాంలు నిండడంతో పాటు తమకు కేటాయించిన కోటా పూర్తయిందని చెప్పినా వినడం లేదని వాపోతున్నారు. ఇదే విషయమై నర్సాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈఓ వెంకటస్వామిగౌడ్‌ను వివరణ కోరగా కొందరు రైస్‌మిల్లర్లు తమకు వడ్లు వద్దని చెప్పడంతో ఇబ్బందులు వస్తున్నాయని తెలిపారు. ఇటీవల సిద్దిపేటలోని రైస్ మిల్లులకు వడ్లను పంపాలని జిల్లా అధికారులు సూచించారని.. అయితే అక్కడికి పంపిన ధాన్యం లారీలు ఇప్పటికీ ఖాళీ కాలేదన్నారు. అక్కడి మిల్లర్లు సైతం మళ్లీ ధాన్యం పంపవద్దని స్పష్టం చేశారన్నారు. మిల్లుల వద్ద లారీలు నిలిచిపోతున్న విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు.



వర్షానికి తడిసి మొలకలు వచ్చిన ధాన్యం



మండలంలోని ఓ రైస్‌మిల్లు వద్ద నిలిచిన లారీలు



టార్పాలిన్‌పై నిలిచిన నీటిని ఎత్తిపోస్తున్న మహిళా రైతులు

పడకేసిన పల్లె పాలన



దౌలాపూర్‌లో అధ్వానంగా మురికి కాలువ

పంచాయతీల ఖాతాలు ఖాళీ
- కరెంట్ బల్బులు, బోరు రిపేర్లకు కష్టాలు
- మల్టీపర్పస్ వర్కర్లకు జీతాలు కరువు
- చేతులెత్తేసిన స్పెషల్ ఆఫీసర్లు

పాపన్నపేట(మెదక్): పల్లె పాలన పడకేసింది. గ్రామ పంచాయతీల ఖాతాలు ఖాళీ అయ్యాయి. కనీసం కరెంట్ బల్బులు, బోరు మరమ్మతులు, డీజిల్ కొనలేని పరిస్థితి ఏర్పడింది. మల్టీపర్పస్ వర్కర్లకు మూడు నెలలుగా జీతాలు కరువయ్యాయి. కరెంట్ బిల్లులు భారంగా మారాయి. మురికి కాల్వలు తీయడం, ప్లాస్టిక్ ఏరి వేయడం తలనొప్పిగా మారింది. స్పెషల్ ఆఫీసర్లు చేతులెత్తేశారు. పంచాయతీ కార్యదర్శులు అప్పులు చేసి కనీస అవసరాలు తీర్చేందుకు నానా తంటాలు పడుతున్నారు. పెద్ద గ్రామ పంచాయతీలు కొంత నయంగా ఉన్నా, వెయ్యి లోపు జనాభా ఉన్న పంచాయతీల పరిస్థితి అధ్వానంగా మారింది.

జిల్లాలో 469 పంచాయతీలు

జిల్లాలో మొత్తం 469 గ్రామ పంచాయతీలు ఉండగా.. ఇందులో వెయ్యి లోపు జనాభా ఉన్న పంచాయతీలు 191 ఉన్నాయి. ఈఏడాది జనవరి 31వ తేదీతో సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసింది. ఫిబ్రవరి 1 నుంచి స్పెషల్ ఆఫీసర్ల పాలన మొదలయ్యింది. జిల్లాలో మొత్తం 227 మంది ప్రత్యేక అధికారులను నియమించారు.

జీపీ కార్యదర్శులకు తప్పని కష్టాలు

పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం, స్టేట్ ఫైనాన్స్ ఇచ్చే నిధులు ముఖ్యమైన ఆర్థిక ఆధారాలు. కాగా 2022 ఆగస్టు నుంచి ఎస్ఎఫ్‌సీ నిధులు రావడం లేదు. ఇక జనాభాకు అనుగుణంగా ఒక్కొక్కరికి రూ.812 చొప్పున 15 ఆర్థిక సంఘం నిధులు మంజూరు చేస్తుంది. ప్రత్యేక అధికారులు వచ్చినప్పటి నుంచి అవి కూడా రావడం లేదు. ఇక పెద్ద పంచాయతీల్లో ఇంటి పన్నులు, తైబజార్, గృహ నిర్మాణ ఫీజులు, వ్యాపార, వాణిజ్య లైసెన్స్ ఫీజుల రూపేనా కొంత ఆదాయం సమకూరుతోంది. కానీ చిన్న గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం ఇచ్చే గ్రాంట్లు తప్ప, ఎలాంటి ఇతర ఆధారాలు లేవు. ఇంటి పన్నులు చాలా మంది కట్టరని తెలుస్తోంది. ఇక వీరు నెల నెలా ట్రాక్టర్ ఈఎంఐ, డీజిల్, బోరు రిపేర్లు, కరెంట్ బిల్లులు, విద్యుత్ బల్బులు, డంపుయార్డుల నిర్వాహణ, మల్టీపర్పస్ వర్కర్ల జీతాలు, పారిశుధ్యం, ప్లాస్టిక్ ఏరివేత, తాగు నీటి సరఫరా లాంటి కార్యక్రమాలను నిర్వహించాల్సి వస్తుంది. అయితే వీటికి వనరులు లేక నానా అవస్థలు పడుతున్నారు. స్పెషల్ ఆఫీసర్లు కనీసం పంచాయతీల వైపు తొంగి చూసిన దాఖలాలు లేవు. దీంతో ఒక్కో పంచాయతీ కార్యదర్శి ఈ నాలుగు నెలల కాలంలో రూ. 20 నుంచి 30 వేల వరకు అప్పులు చేసినట్లు చెబుతున్నారు. గతంలో చెత్త ఏరివేత కోసం ట్రాక్టర్లు, ఆటోలు కొనుగోలు చేశారు. ఇవి సంబంధిత పంచాయతీ కార్యదర్శుల పేరిట రిజిస్ట్రేషన్ అయ్యాయి. ఈఎంఐ కట్టకపోతే, వారి సొంత ఖాతాలకు సంబంధించి సిబిల్ స్కోరు పడిపోతుందని వాపోతున్నారు. దీంతో సొంత అవసరాలకు బ్యాంకు నుంచి అప్పు పుట్టని పరిస్థితి నెలకొందని అంటున్నారు. ఇటీవల తాగునీటి వనరుల నిర్వహణ, మరమ్మతుల కోసం కలెక్టర్ జిల్లాకు రూ.1.96 కోట్లు మంజూరు చేసినప్పటికీ, పార్లమెంట్ ఎన్నికల కోడ్ రావడంతో అవి విడుదల కాలేదు. సర్పంచ్ ఎన్నికలు అయ్యేవరకు ఎలా నెట్టుకు రావాలో అంటూ కార్యదర్శులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

ఇబ్బందికరంగా మారింది

మెజార్టీ గ్రామ పంచాయతీల ఖాతాలు ఖాళీ అయ్యాయి. స్పెషల్ ఆఫీసర్ల పాలన వచ్చాక, ఎలాంటి నిధులు మంజూరు కాలేవు. నిజానికి గ్రామ పాలన పంచాయతీ కార్యదర్శులకు కష్టంగా మారింది. అయినా ప్రజలకు ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకుంటున్నాం. గతంలో చేసిన పనులకు సైతం బిల్లులు ఇంకా రాలేదు. ముఖ్యంగా చిన్న గ్రామ పంచాయతీల నిర్వాహణ ఇబ్బందికరంగానే ఉంది.

– యాదయ్య, జిల్లా పంచాయతీ అధికారి

పెండింగ్ పనులు పూర్తి చేయండి

కలెక్టర్ రాహుల్‌రాజ్



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ కలెక్టరేట్: పాఠశాలల పునః ప్రారంభంలోగా పెండింగ్ పనులు పూర్తిచేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలచే అభివృద్ధి పనులు, ధరణి దరఖాస్తులు, ధాన్యం కొనుగోలు తదితర అంశాలపై శుక్రవారం హైదరాబాద్ నుంచి సీఎస్ శాంతకుమారి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి బ్రాహ్మారావు, మేనేజర్ హరికృష్ణ, డీఆర్డీఓ శ్రీనివాస్‌రావు, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి విజయలక్ష్మి, మెప్మా పీడీ ఇందిరా, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. పాఠశాలల్లో పెండింగ్ పనులు పూర్తి చేయాలని, పాఠశాల ప్రారంభానికి ముందే విద్యార్థులకు అసౌకర్యాలు లేకుండా చూడాలని ఆదేశించారు. ధాన్యాన్ని త్వరగా సేకరించాలని, రైతులకు అండగా ఉండాలన్నారు. జిల్లాలో సీఎంఆర్ పూర్తి చేయాలన్నారు. అలాగే ప్రజావాణి, ధరణి పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు
- 24 నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

మెదక్ కలెక్టరేట్: అధికారులంతా సమన్వయంతో పనిచేసి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పరీక్షల నిర్వహణ, ఏర్పాట్లపై ఇంటర్ విద్యాధికారి సత్యనారాయణతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 24వ తేదీ నుంచి జూన్ 3 వరకు నిర్వహించే పరీక్షలకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఏ చిన్న పొరపాటు జరిగినా విద్యార్థుల భవిష్యత్‌పై ప్రభావం చూపుతుందన్నారు. జిల్లాలో 6,110 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు చెప్పారు. మొదటి సంవత్సరంలో 3,812 మంది రెండో సంవత్సరంలో 2,298 మంది పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 22 కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రశ్నాపత్రాల స్టోరేజీకి 13 పాయింట్లు ఏర్పాటు చేశామని వివరించారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించాలని, పరీక్ష సమయంలో జిరాక్స్ సెంటర్లు మూసివేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆర్టీసీ అధికారులు సమయానికి బస్సులు నడపాలని, వైద్య అధికారులు పరీక్షా కేంద్రాల వద్ద మెడికల్ పాయింట్ ఏర్పాటు చేయాలన్నారు. కంట్రోల్ రూం ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేయాలని ఇంటర్మీడియట్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీఎస్పీ డాక్టర్ రాజేష్, ఆర్టీసీ మేనేజర్ సుధా, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

టెండర్ల ఆహ్వానం

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో నడుస్తున్న సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలల్లో సామగ్రి కొనుగోలు చేసేందుకు ఆసక్తి గల వారి నుంచి టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ రాధాకిషన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని కేజీబీవీ (15), మోడల్ స్కూల్స్ (5), యూఆర్ఎస్ (1) పాఠశాలలకు సామగ్రి సరఫరా చేయాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి, అర్హత గల టెండర్‌దారులు ఈనెల 27వ తేదీలోగా దరఖాస్తులను కలెక్టరేట్‌లోని డీఈఓ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. 29న టెండర్ ప్రక్రియ నిర్వహిస్తామన్నారు.

ఆర్టీసీకి మస్తు పైసల్

- ఓట్ల పండుగ.. లాభాలు దండిగా
- ఎనిమిది డిపోల నుంచి 490 బస్సులు
- ఆరు రోజుల్లోనే రూ.20.38 కోట్ల ఆదాయం



ఓటేసేందుకు వచ్చి తిరిగి బస్సులో తమ స్వస్థలాలకు వెళుతున్న ప్రయాణికులు

నారాయణఖేడ్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఆర్టీసీకి లాభాల పంట పండింది. ఓటర్ల కోసం ప్రత్యేకంగా రీజియన్ నుంచి పలు ప్రత్యేక బస్సులు నడిపారు. దీంతో ఆర్టీసీకి సుమారు రూ.20.38కోట్ల ఆదాయం సమకూరింది. అంటే యావరేజీగా వచ్చే ఆదాయం కంటే రెట్టింపునకు పైగా సమకూరింది. ఓటు హక్కు వినియోగించుకునేందుకు వివిధ ప్రాంతాలకు ప్రయాణించిన వారి ద్వారా ఈనెల 10 నుంచి 16వ తేదీ వరకు (ఆరు రోజుల్లో) రూ.20,38,87,969 ఆదాయం వచ్చింది. రీజియన్ పరిధిలోని ఎనిమిది డిపోలకు చెందిన 490 బస్సులు వివిధ రూట్లలో తిరిగి మస్తు ఆదాయాన్ని తెచ్చిపెట్టాయి. సాధారణ రూట్లలోని బస్సు సర్వీసులకు తోడు కొన్ని ప్రత్యేకంగా బస్సు సర్వీసులను అధికారులు నడిపారు. దీంతో సాధారణం కంటే రెట్టింపు ఆదాయం సమకూరింది. ఓటేసేందుకు రావడానికి తోడు తిరుగు ప్రయాణంలోనూ ఈ ఆదాయం సమకూరింది. గతంలో ఎన్నడూ లేని విధంగా భారీ ఆదాయాన్ని ఆర్టీసీ సొంతం చేసుకుంది.

ఆర్టీసీ బస్సుల్లో కుటుంబ సమేతంగా..

రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సదుపాయం కల్పించడంతో ప్రజలు ఆర్టీసీ బస్సుల్లో అత్యధికంగా ప్రయాణాన్ని సాగిస్తున్నారు. ఎన్నికల సమయంలోనూ కుటుంబ సభ్యులందరూ ఓటేసేందుకు బస్సుల్లోనే వచ్చేందుకు మొగ్గుచూపారు. మహిళలకు ఉచితం ఉండటం కేవలం పురుషులకు మాత్రమే టికెట్ తీసుకోవాల్సి రావడంతో బస్సులు ఎక్కడానికి ఆసక్తి చూపారు. రీజియన్ పరిధిలోని వివిధ నియోజకవర్గాలకు చెందిన గ్రామీణ ప్రజలు.. ఉద్యోగాలు, ఉపాధి కోసం పట్టణ ప్రాంతాల్లో ఉంటున్నారు. చాలామంది హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో పనులు చేస్తున్నారు. ఎన్నికల కారణంగా హైదరాబాద్‌తోపాటు పట్టణాల్లో ఉంటున్నవారు ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఆర్టీసీ బస్సుల్లో సొంత ఊళ్లకు తరలివచ్చారు. పోలింగ్ ప్రక్రియ ముగిసిన తర్వాత కూడా బస్సుల్లోనే తిరుగుముఖం పట్టారు. దీంతో ఆర్టీసీకి దండిగా ఆదాయం సమకూరింది.

డిపోల వారీగా వివరాలు (ఈనెల 10 నుంచి 16వ తేదీ వరకు)

డిపో	బస్సు సర్వీసులు	తిరిగిన కిలోమీటర్లు	రావాల్సిన ఆదాయం	వచ్చిన ఆదాయం
నారాయణఖేడ్	55	230270	రూ.72లక్షలు	రూ.1,06,10,237
సంగారెడ్డి	92	237789	రూ. 1.14కోట్లు	రూ. 1,55,72,401
జహీరాబాద్	84	239993	రూ. 1.32కోట్లు	రూ. 1,58,57,190
నర్సాపూర్	15	49419	రూ. 18లక్షలు	రూ. 28,77,936
మెదక్	90	230270	రూ. 1.26కోట్లు	రూ. 1,53,32,191
గజ్వేల్ ప్రజ్ఞాపూర్	60	186467	రూ. 84లక్షలు	రూ.1,18,45,506
సిద్దిపేట	74	282714	రూ. 1.50కోట్లు	రూ. 1,82,25,777
దుబ్బాక	20	97006	రూ. 48లక్షలు	రూ.70,00,731

ఆదాయం అధికంగా వచ్చింది



రీజియన్ పరిధిలో అన్ని డిపోల నుంచి దాదాపు ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులను నడిపాం. అన్ని డిపోలకు నిత్యం వచ్చే ఆదాయం కంటే అధికంగా వచ్చింది. ప్రయాణికులకు సౌకర్యం కల్పించినందుకు సంతోషంగా ఉంది.

– ప్రభులత, సంగారెడ్డి రీజియన్ మేనేజర్

రైతులను పట్టించుకోని ప్రభుత్వం



మాట్లాడుతున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

మనోహరాబాద్(తూప్రాన్): కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను అష్టకష్టాలు పెడుతుందని మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం మండల కేంద్రంలోని దండుపల్లి రహదారిపై రైతులు, బీఆర్ఎస్ నాయకులతో కలిసి నిరసన తెలిపారు. అనంతరం ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతోనే రైతులకు ఇలాంటి దుస్థితి వచ్చిందన్నారు. బోనస్ చెల్లించి కొనుగోలు చేయాలని, దొడ్డు రకానికి సైతం అదనపు బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోలు చేసే వరకు తమ ఆందోళన విరమించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో పురం రవి, వెంకట్‌గౌడ్, భిక్షపతి, రేణుకుమార్, కుంటరాజు, ఉదయ్‌రంజన్‌గౌడ్, మహేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, ఎంపీపీ మనోజ్‌రెడ్డి

కొండాపూర్(సంగారెడ్డి): మలేషియాలో మూడు రోజులపాటు జరిగిన అంతర్జాతీయ కరాటే పోటీల్లో సంగారెడ్డి జిల్లాకు చెందిన ముగ్గురు విద్యార్థులు సత్తా చాటారు. కోచ్ నటరాజన్ మాట్లాడుతూ జూనియర్ విభాగం స్పారింగ్‌లో శశాంక్ సింగ్ బంగారు పతకం, సాయి సిద్ధార్థ మహారాజ్ వెండి పతకం సాధించినట్లు తెలిపారు. అండర్ సీనియర్ విభాగంలో నరేంద్ర అనే విద్యార్థి వెండి పతకం సాధించాడన్నారు. కరాటే కోచ్‌గా తనకు ఉత్తమ కోచ్ అవార్డు వచ్చినట్లు పేర్కొన్నారు. గెలుపొందిన విద్యార్థులు, కోచ్ స్వదేశానికి రావడంతో సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే తూర్పు జయప్రకాశ్ రెడ్డి వారికి ఘన స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో కొండాపూర్ మనోజ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రిజిస్ట్రేషన్ విలువకు ఇంటి పన్నుకు ముడి పెట్టొద్దని కోరుతూ తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. ఈ సందర్భంగా తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వర గారి రమణ మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి రిజిస్ట్రేషన్ విలువ పెంచుతున్నారన్న వార్తలు వినిపిస్తున్నాయని తెలిపారు. రిజిస్ట్రేషన్ ధరలు పెంచితే దానికి అనుగుణంగా ఇంటి పన్నులు పెరిగే అవకాశం ఉంటుందన్నారు. గతంలో కూడా అదే జరిగిందన్నారు. దానిని దృష్టిలో పెట్టుకొని సీఎంకి లేఖ రాయడం జరిగిందన్నారు. ఇంటి పన్నును ఏఆర్‌వీ పద్ధతిన వేయాలని కోరినట్లు పేర్కొన్నారు. మున్సిపాలిటీలో, జీహెచ్ఎంసీలో ఒకే మాదిరిగా ఇంటి పన్ను ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని లేఖలో కోరినట్లు తెలిపారు.

కొడుకు హత్య కేసులో తండ్రి అరెస్ట్

- మరో ఐదుగురి రిమాండ్
- బెట్టింగ్‌కు బానిసయ్యాడని ఘాతుకం

చిన్నశంకరంపేట(మెదక్): కన్న కొడుకును హత్యచేసిన తండ్రితోపాటు సహకరించిన మరో ఐదుగురిని శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు రామాయంపేట సీఐ వెంకటేశ్, చిన్నశంకరంపేట ఎస్ఐ నారాయణ తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. భగీరథపల్లి గ్రామానికి చెందిన ముఖేష్ కుమార్ బెట్టింగ్‌లో రూ.కోట్ల విలువ చేసే ఆస్తులను అమ్మేశాడు. మిగిలిన నివాస గృహం కూడా అమ్మేద్దామని తల్లిదండ్రులపై ఒత్తిడి పెంచడంతో ముఖేశ్‌ను హతం చేసేందుకు తండ్రి సత్యనారాయణ సిద్ధపడ్డాడు. తన సోదరుడు రమేశ్, పాలివారైన నాగరాజు,సత్యనారాయణ, నెల్లూర్, నర్సింహులు సహకారంతో కుమారుడిని హత్యచేశాడు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెంకటేశ్ తెలిపారు.

అన్నను చంపిన కేసులో యావజ్జీవ శిక్ష

అల్లాదుర్గం(మెదక్): అన్నను చంపిన తమ్ముడికి యావజ్జీవ శిక్షతోపాటు రూ.20 వేలు జరిమానా విధిస్తూ జిల్లా శేషన్ కోర్టు జడ్జి లక్ష్మీ శారద శుక్రవారం తీర్పు వెల్లడించినట్లు అల్లాదుర్గం ఎస్ఐ ప్రవీణ్ రెడ్డి తెలిపారు. అల్లాదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని చిల్వెర గ్రామానికి చెందిన విఠల్‌కు సొంత అన్న జగన్‌తో గతేడాది మే నెలలో డబ్బుల విషయంపై గొడవ జరిగింది. విఠల్ మద్యం మత్తులో అన్నను బండరాయితో కొట్టి చంపాడు. ఈ ఘటనపై అప్పటి సీఐ జార్జ్, ఎస్ఐ ప్రవీణ్ రెడ్డి కేసు నమోదు చేశారు. ఈ కేసులో సాక్ష్యాధారాలను పరిశీలించిన జిల్లా స్పెషన్ కోర్టు జడ్జి లక్ష్మీ శారద నిందితుడికి శిక్ష విధించారు.

యువకుడి అదృశ్యం

మనోహరాబాద్(తూప్రాన్): యువకుడు అదృశ్యమైన ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. కూచారం గ్రామానికి చెందిన కిష్టపురం క్రిష్ణ, అక్క లలిత ఆమె పిల్లలతో కలిసి జీవనం సాగిస్తున్నారు. అల్లుడు ప్రసన్న కుమార్ జులాయిగా తిరుగుతూ మద్యానికి బానిసయ్యాడని ఈ నెల 15న క్రిష్ణ మందలించడంతో ఇంట్లోంచి వెళ్లిపోయాడు. కుటుంబీకుల ఫిర్యాదు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపారు.

సర్కారు బడికి జై

ప్రైవేట్ నుంచి ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థులు

- ఆసక్తి చూపుతున్న తల్లిదండ్రులు
- మంచి ఫలితాలతో పెరుగుతున్న డిమాండ్
- ఇంగ్లిష్ మీడియం, డిజిటల్ తెరలతో బోధన

ప్రభుత్వ పాఠశాలలు మెరుగుపడ్డాయి. గతంలో ప్రభుత్వ పాఠశాల అంటే శిథిల భవనాలు, బోధన సరిగా ఉండదని, అసౌకర్యాలతో గదులు ఉంటాయనే భావన ఉండేది. దీంతో అందరూ ప్రైవేటు పాఠశాలకు వెళ్లడానికి మొగ్గు చూపేవారు. ప్రస్తుతం ఈ సీన్ మారిపోయింది. ప్రభుత్వ పాఠశాలల వైపు విద్యార్థులు అడుగులు వేస్తున్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడుల్లో చదువు చెబుతుండడంతో సర్కారు బడుల్లో చేర్పించేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు సైతం మొగ్గు చూపుతున్నారు. ఇక్కడ ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టడంతో ఆరేళ్లుగా మంచి డిమాండ్ ఉంది.

– రామచంద్రాపురం(పటాన్‌చెరు)



తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదుల నాగులపల్లి జిల్లా పరిషత్ పాఠశాల

రామచంద్రాపురం పట్టణంలోని జిల్లా పరిషత్ పాఠశాలలోనే గతేడాది ప్రైవేట్ పాఠశాలలకు చెందిన సుమారు 100 మంది విద్యార్థులు చేరారంటే ప్రభుత్వ పాఠశాలలకు ఎంత డిమాండ్ ఉందో అర్థం చేసుకోవచ్చు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెల తెలంగాణ ప్రభుత్వ పాఠశాలలో సైతం ప్రైవేట్ పాఠశాలలకు చెందిన అనేక మంది విద్యార్థులు ఎంట్రెన్స్ పరీక్షలు రాసి మరీ పాఠశాలలో చేరుతున్నారు.

నాణ్యమైన విద్యాబోధన..

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యావంతులైన ఉపాధ్యాయులు ఉండడంతో నాణ్యమైన విద్యను అందించి వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేస్తున్నారు. దీనికితోడు ప్రభుత్వం సైతం ఎప్పటికప్పుడూ ఉపాధ్యాయులకు ఆధునిక విద్యా బోధనపై శిక్షణను అందిస్తుంది.

ప్రభుత్వ పాఠశాలల మధ్య పోటీ...

కార్పొరేట్ పాఠశాలల మాదిరిగా ప్రభుత్వ పాఠశాలల మధ్య మరింత పోటీతత్వం పెరిగింది. దీంతో మంచి ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు పోటీలు పడుతున్నారు. దాని కారణంగా పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించి వారివారి సబ్జెక్టుల్లో విద్యార్థులు మంచి మార్కులు సాధించే విధంగా ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తున్నారు. 10వ తరగతిలో మంచి ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు పోటీపడుతున్నారు. అందులో భాగంగానే ఈ ఏడాది అనేక ప్రభుత్వ పాఠశాలలో వందశాతం ఉత్తీర్ణత సాధించారు.

డిజిటల్ బోధన..



పాఠశాలలో డిజిటల్ తరగతులు

పాలకుల ప్రత్యేక శ్రద్ధ, స్థానిక ప్రజాప్రతినిధుల కృషితో నేడు ప్రభుత్వ పాఠశాలల భవనాలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ నిధులు, దాతల సహకారంలో ఆధునిక భవనాలను నిర్మించారు. అందులో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలను కల్పించారు. విద్యార్థులకు మరింత ఆధునిక విద్యను అందించాలన్న లక్ష్యంతో ఆధునిక డిజిటల్ తెరలు, గ్రీన్ బోర్డు ఏర్పాటు చేసి బోధిస్తున్నారు.

వంద మంది చేరారు



గతేడాది తమ పాఠశాలలో ప్రైవేట్ పాఠశాలలకు చెందిన సుమారు వంద మంది విద్యార్థులు చేరారు. డిజిటల్ తరగతి గదుల్లో నాణ్యమైన విద్యాబోధన అందిస్తున్నాం. ఇప్పటికే ప్రైవేట్ పాఠశాలల్లో చదివే విద్యార్థుల తల్లిదండ్రులు వారి పిల్లలను తమ పాఠశాలలో చేర్పించేందుకు మా పాఠశాల వద్దకు వస్తున్నారు.

– పీపీ రాథోడ్, ప్రధానోపాధ్యాయుడు, జెడ్పీహెచ్ఎస్ రామచంద్రాపురం

మంచి ఫలితాలు సాధిస్తున్నాం



ప్రభుత్వ పాఠశాలలో వందశాతం ఉత్తీర్ణతను సాధిస్తున్నాం. నాణ్యమైన విద్యాబోధన చేసి మంచి ఫలితాలు రాబడుతున్నాం. ప్రైవేట్ పాఠశాలలో చదివే విద్యార్థుల తల్లిదండ్రులు వారి పిల్లలను తమ పాఠశాలలో చేర్పిస్తున్నారు. అందుకు అనుగుణంగానే విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేస్తున్నాం.

– శ్రీనివాస్ రాథోడ్, ఉపాధ్యాయులు, జెడ్పీహెచ్ఎస్ ఈదుల నాగులపల్లి



హడలెత్తిస్తున్న పిడుగులు

- వారం రోజుల్లో ఇద్దరు మృతి
- పదుల సంఖ్యలో జీవాలు మృత్యువాత
- నష్టపోతున్న పశువుల కాపరులు
- అప్రమత్తత అవసరమంటున్న నిపుణులు

మెదక్ కలెక్టరేట్: అకాల వర్షాలు జిల్లా ప్రజలను అగమాగం చేస్తున్నాయి. ఓ వైపు రైతులు పండించిన పంటలు తడిసి తీవ్ర నష్టం జరుగుతుండగా, మరోవైపు ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన పిడుగులు మనుషుల, మూగ జీవాల ప్రాణాలు తీస్తున్నాయి. జిల్లాలో కురుస్తున్న అకాల వర్షాలతో రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వారం రోజుల్లో పిడుగులతో ఇద్దరు రైతులతోపాటు 10 మేకలు, ఒక ఆవు మృత్యువాత పడ్డాయి.

పొలాల్లోనే ఎక్కువ

గ్రామాల్లో ప్రజలు తమ పశువులు, మేకలు, గొర్రెలను ఇళ్ల మధ్య స్థలాలు లేకపోవడంతో గ్రామ శివారుల్లో, పొలాల్లో పాకలు ఏర్పాటు చేసి కట్టేస్తున్నారు. వేసవిలో ఎండల తీవ్రతకు నీడ కోసం చెట్ల కింద కట్టేస్తుంటారు. ఇదే సమయంలో ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు ఒక్కసారిగా వాతావరణం చల్లబడి అకాల వర్షాల రూపంలో పిడుగు పడుతుంటాయి. అలాగే మూగ జీవాలతోపాటు పశువులు, మేకలు, గొర్రెలను మేతకు తీసుకెళ్లే కాపరులు, పొలాల్లో పనిచేసే రైతులు పిడుగుపాటుతో మృత్యువాత పడుతున్నారు. ప్రకృతి వికృత రూపంతో ఏర్పడిన నష్టానికి ప్రభుత్వం మొక్కుబడి పరిహారం ఇస్తుందని రైతులు ఆరోపిస్తున్నారు.



పెద్దశంకరంపేట పిడుగుపాటుతో చనిపోయిన శ్రీరాములు, విశాల్ (ఫైల్)

ఆరు రోజుల కిందట తాత, మనుమడు.. మొన్న మూగజీవాలు

పెద్దశంకరంపేట మండలం రామోజీపల్లి గ్రామంలో ఈనెల 12న ఆదివారం ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన అకాల వర్షం కురిసింది. స్థానిక ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఉంచిన ధాన్యం తడిసిపోతుందని, దాన్ని కాపాడుకుందామని వరుసకు తాత మనవళ్లు అయ్యే శ్రీరాములు, విశాల్‌లు అక్కడకు వెళ్లారు. ధాన్యంపై టార్పర్ వేస్తున్న సమయంలో పిడుగు పడగా ఇద్దరు అక్కడికక్కడే విగత జీవులయ్యారు. అలాగే 16న పాపన్నపేట మండలం ఆరేపల్లి గ్రామంలో పిడుగు పడి పది మేకలు, రామాయంపేట మండలం డి.ధర్మారం గ్రామంలోని జెల్ల యాదగిరికి చెందిన పాడి ఆవు మృత్యువాత పడ్డాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పిడుగుపాటు మృత్యువాత పడిన మనుషులకు రూ.6 లక్షలు, పాడి గేదెలకు రూ.30,000, గొర్రెలు, మేకలు మృత్యువాత పడితే రూ.3,000ల చొప్పున పరిహారం అందిస్తారు.

అప్రమత్తత అవసరం



ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడుతున్న సమయంలో రైతులు చాలా జాగ్రత్తగా ఉండాలి. వాతావరణ పరిస్థితులను బట్టి వెంటనే అప్రమత్తం కావాలి. పశువులను, మేకలు, గొర్రెలను చెట్ల కింద ఉంచకూడదు. రైతులు సైతం చెట్లకు దూరంగా ఉండాలి. ముఖ్యంగా సెల్‌ఫోన్‌లు వాడకపోవడం చాలా మంచింది. నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుంది.

– వెంకటయ్య, జిల్లా పశువైద్యాధికారి

ఆశ్రయం ఏదీ?

- అనాథల కోసం ఆశ్రయ కేంద్రం ఏర్పాటు
- రూ.65 లక్షలతో నిర్మాణం
- వృథాగా పడి ఉన్న భవనం
- పట్టించుకోని అధికారులు



మెదక్ పట్టణంలో రోడ్డు పక్కన కొట్టుమిట్టాడుతున్న ఓ వృద్ధురాలు

మెదక్‌జోన్: ఆమెకు రోడ్డే ఇల్లు.. అక్కడే తింటూ.. అక్కడే నిద్రిస్తుంది.. మూలుగుతూ ముసురుతున్న ఈగలతో వేగలేక ముగ్గు బుట్టలాంటి తల ముడతలతో తేరిన దేహంతో కనిపిస్తుంది.. తన కన్నా శవం నయం అనే నిస్సాహాక స్థితిలో పడి ఉంది.. అయినా ఒక్కరూ స్పందించరు. మెదక్ జిల్లా కేంద్రంలోని ధ్యాన్‌చంద్ విగ్రహం సమీపాన రోడ్డు పక్కన ఓ 90 ఏళ్ల వృద్ధురాలు లేవలేని స్థితిలో కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతుంది. ఇలాంటి అనాథలు పట్టణంలో నిత్యం ఎక్కడో ఒకచోట దర్శనం ఇస్తున్నారు.అలాంటి వారి కోసం పట్టణ పరిధిలోని పిల్లికొటాల్ వద్ద గల మాతా, శిశు ఆస్పత్రి వెనుక కాల రూ.65 లక్షలు వెచ్చించి 2023లో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ఆధ్వర్యంలో నిరాశ్రయుల ఆశ్రయ కేంద్రాన్ని నిర్మించారు. ఇందులో అనాథలను చేర్పించి నిత్యం ఐదుగురికి భోజన వసతి సైతం కల్పించే వీలున్నా, మున్సిపల్ అధికారులు, పాలకులు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. ఫలితంగా ఆ భవనం వృథాగా మారింది. అది కేవలం ఆస్పత్రికి రాత్రి వేళలో వారు సేద తీర్చుకునేందుకు ఉపయోగిస్తున్నారు తప్ప ఏ దిక్కు మొక్కులేని అనాథలను మాత్రం చేరదీయడం లేదు. ఫలితంగా ఏ లక్ష్యం కోసం నిర్మించారో ఆ లక్ష్యం నెరవేరడం లేదు. అందులో ఒక మేనేజర్‌తోపాటు ఇద్దరు స్వీపర్లకు సైతం ప్రభుత్వం వేతనాలు ఇస్తుంది. కానీ శుక్రవారం దాన్ని విజిట్ చేయగా అందులో ఒక అటెండర్ తప్ప ఎవరూ అందుబాటులో లేరు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధి కారులు స్పందించి ఏ దిక్కు ముక్కులేని వారిని గుర్తించి నిరాశ్రయుల కేంద్రంలో చేర్పించి వారికి భోజన వసతి కలిపించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



నిరాశ్రయుల ఆశ్రయ కేంద్రం

ప్రమాదవశాత్తు గుండంలో పడి

యువకుడు మృతి

సంగారెడ్డి టౌన్: ప్రమాదవశాత్తు యువకుడు గుండంలో పడి మృతి చెందిన ఘటన సంగారెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్లో పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పట్టణ పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన అరుణ్ కుమార్(18) పట్టణంలో చిన్నపాటి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం పోతిరెడ్డిపల్లి చౌరస్తాలోని శివాలయం ఆవరణలోని గుండంలో స్నానం చేసేందుకు దిగి ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడు. మృతుడి సోదరి అరుణ ఫిర్యాదు పోలీసులు కేసు నమోదు చేశారు.

డీసీఎం, బైక్ ఢీ

వ్యక్తి మృతి

హత్నూర(సంగారెడ్డి): డీసీఎం, బైక్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన హత్నూర మండలం సిరిపురం గ్రామ శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై సుభాష్ కథనం మేరకు.. మండల పరిధిలోని భీమ్లా తండా పంచాయతీ పరిధిలోని పీరియతండాకు చెందిన పాప్య (25) నర్సాపూర్, జోగిపేటలో అడ్డా కూలీగా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. శుక్రవారం ఉదయం పని కోసం బైక్ పై జోగిపేటకు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న డీసీఎం బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పాప్య తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తండావాసులు ప్రమాదానికి కారణమైన డీసీఎం వాహనాన్ని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. మృతుడి భార్య సాంకి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..

ములుగు(గజ్వేల్): గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ గుర్తు తెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన ములుగు మండలం వంటిమామిడి రాజీవ్ రహదారిపై గురువారం రాత్రి చోటు చేసుకుంది. ములుగు ఎస్ఐ విజయ్‌కుమార్ కథనం మేరకు.. మృతుడి వయస్సు 30 నుంచి 40 ఏళ్లు ఉంటుందని, మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వాస్పత్రిలోని మార్చురీలో భద్రపరిచామన్నారు. ఆచూకీ తెలిసినట్లయితే ములుగు పోలీస్ స్టేషన్ 87126 67338 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.



పోలీసులు పట్టుకున్న బియ్యం

రేషన్ బియ్యం పట్టివేత

గజ్వేల్‌రూరల్: ఆటోలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని సిద్దిపేట టాస్క్ ఫోర్స్ పోలీసులు, గజ్వేల్ పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. ఈ సందర్భంగా టాస్క్ ఫోర్స్ పోలీసులు మాట్లాడుతూ.. గజ్వేల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అహ్మదీపూర్ గ్రామానికి చెందిన తోట ప్రవీణ్ ఆటోలో 15 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు పట్టుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నంగునూరు(సిద్దిపేట): ఆటోలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని శుక్రవారం సిద్దిపేట టాస్క్ ఫోర్స్, రాజగోపాలపేట పోలీసులు పట్టుకున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండలం పుట్టగూడెంకు చెందిన మాలోత్ శంకర్ ఆటోలో 5 క్వింటాళ్ల బియ్యం తరలిస్తుండగా అంక్షాపూర్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నదిలో దూకి వ్యక్తి ఆత్మహత్య

రాయికోడ్(అందోల్): జీవితంపై విరక్తితో నదిలో దూకి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని సిరూర్ గ్రామ శివారులో చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకట్‌రెడ్డి కథనం మేరకు.. జహీరాబాద్ మండలం పస్తాపూర్ గ్రామానికి చెందిన తలారి రవికుమార్ (50) జహీరాబాద్‌లోని ఓ కంపెనీలో ఉద్యోగం చేస్తుండేవాడు. కొంతకాలంగా పైల్స్ వ్యాధితో బాధపడుతూ చికిత్స తీసుకుంటున్నాడు. ఎంతకూ వ్యాధినయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెందాడు. గురువారం బయటకు వెళ్తున్నానని ఇంట్లో కుటుంబీకులకు చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. రాయికోడ్ మండలం సిరూర్ గ్రామ శివారులోని మంజీరా నది నీటిలో శుక్రవారం మృతదేహం తేలడాన్ని గుర్తించిన పలువురు పోలీసులకు సమాచారం ఇవ్వగా, వారు వచ్చి బయటికి తీశారు. మృతదేహాన్ని తెలిసిన వారు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడి కుమారుడు శ్రీకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.



రవికుమార్ మృతదేహం

చెరువులో గల్లంతు

శివ్వంపేట(నర్సాపూర్): చెరువులో వ్యక్తి గల్లంతైన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భోజ్య పంచాయతీ హరిదాస్ తండాకు చెందిన బానోత్ శంకర్ గురువారం స్నేహితులతో కలిసి తండా నుంచి వెళ్లాడు. శుక్రవారం ఉదయం వరకు ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు శంకర్ వెంట వెళ్లిన ఓ స్నేహితుడిని అడగడంతో సరియైన సమాధానం చెప్పలేదు. ఆచూకీ కోసం వెతుకుతున్న క్రమంలో గంగాయిపల్లి గ్రామ శివారులో ఉన్న ఊర్గల చెరువు కట్టపైన శంకర్ దుస్తులు కనిపించాయి. వెంటనే తండా వాసులు, కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. చెరువులో నీట మునిగాడనే అనుమానంతో నర్సాపూర్ అగ్నిమాపక సిబ్బంది, తండా వాసులు చెరువులో గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదు.

పశువుల కాపరిని ఢీకొట్టిన కారు

- ప్రమాదంలో తెగిపడ్డ కాలు
- ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి

కొల్చారం(నర్సాపూర్): పశువుల కాపరిని కారు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఈ ఘటన మండల కేంద్రంలోని మెదక్-నర్సాపూర్ జాతీయ రహదారి పోలీస్ స్టేషన్ ఎదుట శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కొల్చారానికి చెందిన నిమ్మగల్ల దేవయ్య (55) రోడ్డు పక్కన పొలంలో బర్లను మేత కోసం తీసుకొచ్చాడు. మేతను మేస్తూ గేదెలు రోడ్డు ఆవలి వైపునకు వెళ్లాయి. వాటి దగ్గరకు వెళ్లేందుకు దేవయ్య రోడ్డు దాటుతున్నట్లు క్రమంలో మెదక్ వైపు ఉంచి వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దేవయ్య తొడ భాగం వరకు కాలు తెగి కొద్ది దూరంలో పడింది. తలకు సైతం తీవ్ర గాయాలు కాగా స్థానికులు చికిత్స నిమిత్తం మెదక్ ప్రభుత్వ ఆస్పత్రి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో గాంధీ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య దేవమ్మ, ముగ్గురు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కొల్చారం ఎస్ఐ మహమ్మద్ గౌస్ తెలిపారు.



ఘటనా స్థలిలో దేవయ్య

తాళం వేసిన ఇళ్లలో చోరీ

బంగారం, వెండి, నగదు అపహరణ

సిద్దిపేటరూరల్: తాళం వేసిన ఇళ్లలో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడిన ఘటన బచ్చాయిపల్లి గ్రామంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు..రాఘవాపూర్ మధిర గ్రామమైన బచ్చాయిపల్లికి చెందిన మంత్రి రాజు, మంత్రి ప్రశాంత్ అన్నాదమ్ములు. ఇద్దరూ కుటుంబ సభ్యులతో కలిసి ఇళ్లకు తాళాలు వేసి గురువారం చీకోడు గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లారు. శుక్రవారం ఉదయం ఇంటికి వచ్చేసరికి ఇళ్ల తాళాలు పగులగొట్టి ఉండటాన్ని గుర్తించారు. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలోని నగదు, బంగారం, వెండి కనబడలేదు. పోలీసులకు సమాచారం అందించగా ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మంత్రి రాజుకు చెందిన రూ.52 వేలు, తులం బంగారం, 35 తులాల వెండి గొలుసులు, అదే విధంగా ప్రశాంత్‌కు చెందిన 2 తులాల బంగారం 8 తులాల వెండి దొంగతనం జరిగినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అపూర్వ రెడ్డి తెలిపారు.



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

కుమారుడితో సహా తల్లిదండ్రులు మృతి

- ఓటు వేసేందుకు సొంతూరు వెళ్లి తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదం
- సంగారెడ్డి జిల్లా రాంసానిపల్లి వద్ద ఘటన
- మృతులు కామారెడ్డి జిల్లా తడ్కూర్ వాసులు





శ్రీనివాస్, సునీత, నగేశ్ మృతదేహాలు

వట్‌పల్లి(అందోల్): రోడ్డు ప్రమాదంలో బాలుడితో సహా దంపతులు మృతి చెందారు. ఈ సంఘటన సంగారెడ్డి జిల్లా అందోలు మండలం రాంసానిపల్లి శివాలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కామారెడ్డి జిల్లా మద్నూర్ మండం పెద్ద తడ్కూర్ గ్రామానికి చెందిన శ్రీనివాస్(35), సునీత(30) దంపతులు. వీరికి నగేశ్ (7) కుమారుడు ఉన్నాడు. కొన్నేళ్ల క్రితం ఉపాధి కోసం హైదరాబాద్‌లోని బాచుపల్లికి వలస వెళ్లారు. అక్కడ ప్రైవేట్ కంపెనీలో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈనెల 12వ తేదీన ఓటు హక్కు వినియోగించుకునేందుకు స్వగ్రామానికి వెళ్లారు. ఓటు వేసిన అనంతరం మిగిలిపోయిన పనులను పూర్తి చేసుకొని శుక్రవారం బైక్‌పై బాచుపల్లికి బయలుదేరారు. సంగారెడ్డి జిల్లా అందోలు మండలం రాంసానిపల్లి వద్ద ఉన్న జాతీయ రహదారి వీరి బైక్ అదుపుతప్పి డివైడర్‌కు ఢీకొట్టడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న ఎస్ఐ అరుణకుమార్ సంఘటనా స్థలానికి చేరుకొని శ్రీనివాస్, సునీతలను ఆటోలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే చనిపోగా, ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న నగేశ్ అనే బాలుడిని పోలీసు వాహనంలో తరలిస్తుండగా అన్నాసాగర్ దాటగానే కన్నుమూశాడు. మృతుడు శ్రీనివాస్ ఫోన్‌లోని సిమ్‌కార్డును వేరొక ఫోన్‌లో వేసి మృతుల వివరాలను తెలుసుకొని వారి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాలను జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీలో ఉంచారు. శ్రీనివాస్‌కు ఇద్దరు కుమారులుండగా.. ఒకరు తన వెంట రాగా, పెద్ద కుమారుడు అతడి సోదరితో కలిసి బస్సులో బాచుపల్లికి వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.